

ఆ పేరు వింటేనే సిగ్గుతో తామరమొగ్గ అయ్యేది సుమ. ఇప్పుడు అగ్గిమీది గుగ్గిలంవలె కుతకుత ఉడికిపోతున్నదామె హృదయం.

కానయితే మేన బావ. అతనిది పెద్ద ఆస్తి గల కుటుంబమేమీ కాదు. తన తండ్రి ఆర్థిక

## డా॥ మలయశ్రీ

సహాయంతోనే డాక్టరీ పూర్తి చేశాడు. పై చదువులకు ఫారన్ వెళ్ళాడు. చదువు పూర్తికాగానే అక్కడే స్థిరపడ్డాడు. అక్కడి సంపాదన, విలాసవంతమైన జీవితం చూసి, ఇండియాకు తిరిగి రావాలనిపించలేదు.

కొడుక్కు ఉద్యోగం రావటంతోనే తల్లిదండ్రుల దర్జా పెరిగింది. మాట మారింది. కొడుక్కి పెద్దింటి సంబంధాలు వెదకసాగారు.

ఆ విషయం ఆనోటా ఈనోటా విని, ఇదే మిటీ? మేనల్లుడని, మా అమ్మాయిని చేసుకుంటాడని, అంత డబ్బు ఖర్చుపెట్టి ఇంత చదువు చదివిస్తిని కదా. ఇప్పుడు వేరే సంబంధం చేసుకుంటామనడం భావ్యమా?" అడిగాడు సుమ తండ్రి ఓనాడు బావగారింటికి వెళ్ళి.

"మేమెక్కడ వెళ్ళాం? వాళ్ళే వస్తున్నారు" అన్నాడు సుమ మామ.

"వాళ్ళు అంతిస్తమంటున్నారు. వీళ్ళు ఇంతిస్తమంటున్నారు" అంది సోదరి. బావ పరాయింటి వ్యక్తి. తప్పుగా మెలిగితే తప్పుపట్టే పని లేదు. కానీ, తన సొంత సోదరి పరాయి మనిషి వలె డబ్బు లెక్కలు పెట్టడం ఇతనికి బాధ కలిగించింది.

"ఇంత డబ్బును ఖర్చు పెట్టితిని కదా" అన్నాడు.

"ఎవరికి? చెల్లెలి కొడుక్కే కదా! అమ్మమ్మగారింటి ఆస్తి అనుభవించడానికి వాడికి ఆ మాత్రం హక్కులేదా?" అందామె.

"అది సరే – మరి, మేనల్లుని మీద నాకు మాత్రం హక్కు ఉండదా పిల్లను ఇవ్వడానికి" అనుకున్నాడు. అలా అనక "రక్త సంబంధం, దగ్గర బంధుత్వం ఇప్పుడు కాదని దూరం అయితే ఏమి బాగుంటుంది చెప్పు" అన్నాడు.

# షాలిన్ మొగుడు



"కాదని ఎక్కడన్నామయ్యా బావా?" బావ అన్నాడు.

"మీ మాటల ధోరణి ఎటో ఉంది కదా." ఇతడన్నాడు.

"మంది ఇస్తామన్నంత ఇస్తే ఇటే ఉంటది." అదీ బావ భావం.

"ఆలోచించుకోండి. దగ్గరి వాళ్ళం దూరమవుతాం" బంధుత్వ భావన.

"ఈ కాలంలో డబ్బుతోనే చుట్టరికాలు" యుగధర్మాన్ని వివరించింది సోదరి. చెల్లెలి వంతపాటకు అరికాళ్ళ మంట నెత్తికెక్కింది అన్నకు.

"ఆశపెట్టి డబ్బులాగి వాడుకొని, బాగుపడి ఇప్పుడు నన్ను రెంటాముంచ చూస్తున్నారు" కొంచెం కటువుగానే అన్నాడు.

"నువ్వు మునిగేదేంలేదయ్యా! అంతగా ఇదయితే నీ డబ్బు వడ్డీతో సహా వాపసు ఇచ్చేస్తాం" అతి మర్యాద

బావది. అతడు లౌక్యం తెలిసిన కార్యసాధకుడు.

"ఏమంటావమ్మా?" చెల్లెనడిగాడు.

"నేనేమంటా? వాళ్ళు డబ్బు మనుషులన్నయ్యా!" నేనేమన్నా వాళ్ళతో నేను జీవితమున్నంత కాలం మాటలు పడవల్సివస్తుంది. మీ బావగుణం మీకు తెలువనిదా? ఆయన కొడుకే నీ మేనల్లుడు. నా మాటేం నడుస్తది? ఆడమనిషిని" అని ఆమె ఉపాయంగా తప్పుకుంది.

"సరే ఏం కావాలో చెప్పవయ్యా?" బావనడిగాడు.

"అల్లుడు రానీ వాణ్ణి ఆడుగుదాం" తనదేం లేదన్న నటవ.

"మీ పాట కానీండి... అతడు మీ మాట వినడనుకోను".

"ఓ 'ల'కారమైనా లేందే ఈ కాలంలో గౌరవంగా ఉండదు. బయటి వాళ్ళు రెండు లక్షలు ఇస్తామని వస్తున్నారు. అయితే మొదటి నుంచీ అనుకున్నది మేనరిక సంబంధం. మిమ్మల్ని అడగందే ఎవరికీ మాట ఇవ్వకూడదనుకున్నా."


"సరే... నా వల్ల మీ గౌరవానికి లోటు ఎందుకు రానివ్వాలె? మరి, ముప్పై వేల వరకూ ఇదివరకే ఇస్తిని కదా!

"అది మినహాయించుకోనే మిగతాది ఇవ్వండి. ఇరవైవేలు బంగారం పెట్టుకొని యాభై వేలు నగదు ఇవ్వాలి సుమా!"


"నాకు ముగ్గురు కూతుళ్ళు, నలుగురు ఆడబిడ్డలు. పట్టుచీరెలు, కట్నాలు, కానుకలూ అన్నీ చక్కగా జరుపాలి అన్నయ్యా! ఇదొక్కటే మా యింట జరిగే మగపెండ్లి" అంది చెల్లెలు.

"మొదటే బాగా ఆలోచించుకో. తొందరపడి ఔనని ఆ తర్వాత కాదని ప్రయోజనం ఉండదు. అది ఉభయులకూ కష్టం" అన్నాడు బావ.

"అలా జరగనీయను" అని వాళ్ళ కోర్కెలను అన్నింటినీ ఒప్పుకొని వచ్చాడు. ఆ పెళ్ళి బేరా



హైదరాబాద్‌లో 'సిక్సర్ కథలు' పుస్తకం ఆవిష్కరణ సభలో పాల్గొన్న రచయితలు చంద్రశేఖర్ ఆజాద్, మోహన్‌రావు దురికి, పరుచూరి బ్రదర్స్, విజయేంద్ర ప్రసాద్




లన్నీ విని "నాకీ పెళ్ళివద్దు" అంది సుమ ఏడుస్తూ.

"నువ్వు వద్దన్నా నీ పెళ్ళి చేయటం మాకు కావాలమ్మా" అన్నాడు తండ్రి.

"ఇంత ఖర్చు నాకే అయితే, చెల్లికేం మిగులుతుందిక?"

"ఆ సంగతి అప్పటికి చూద్దాం. మేము బతికే ఉన్నాం. ఇల్లుంది. బావంటే నీకు ఇష్టం. ఎంత ఖర్చయినా కాదనవద్దు తల్లీ" అంది తల్లి.

ఫారిన్ అల్లుడు వస్తున్నాడు, తమ కూతురు భర్తతోపాటు విమానంలో విదేశాలకు వెళ్ళనుంది, సుఖంగా బతకనుంది - అనే ఆశ, సంతోషం వారిని విచారం నుంచి దూరం చేసినై. సంతృప్తిగానే పెళ్ళి పనుల్లో లీనమైనారు.

శుభలేఖలు, కొత్తబట్టలు, పందిళ్ళు, పిండివంటలు, మేళతాళాలు అన్నీ సిద్ధమైనాయి.

పెళ్ళికొడుకు వాళ్ళు రెండు సర్వీసుల నిండా పెళ్ళిరోజు వధువింటికి తరలి వచ్చారు. ఎదుర్కోలు నుంచి ఆరంభమైంది తగాదా. బ్యాండు నాసిరకం అనేది వియ్యాల వారి మొదటి వంక. వియ్యంకుని బావలను సరిగా గౌరవించలేదని రెండవ ఆక్షేపణ, వరుని సూట్లు కుట్టడం కుదర్లేదని మూడవ వంక. భోజనాల వేళ విస్తళ్ళు బాగా లేవని మరొకవంక... ఇవన్నీ పెద్దవేం కాదు. వధువువాళ్ళు వాటిని అంతగా పట్టించుకోలేదు కూడా. కానీ, వరుని కొత్త కోరిక మామకు ప్రాణ సంకటమయింది. అతడు కారు కోరాడు. కాదనటమెందుకా అని కట్నం డబ్బులో మరి పదిరవైవేలు అదనంగా కలిపి కొనిస్తానన్నాడు మామ, కానీ, కట్నంలో కాణీ తక్కువ కాకుండా తనకు ఇవ్వాల్సిందే అన్నాడు వరుని తండ్రి. అతనికి కూతురు పెళ్ళి అప్పు ఉందట. ఈ తగాదా తెగేదిగా లేదు. బావ, అల్లుడు తమ పట్టుదలల మీదున్నారు. కన్యాదాతకు ఏమీ పాలుపోలేదు. ఎలాగైనా

అల్లుని కోరిక తీరుద్దామంటే ఇప్పటికే ఈ ఏర్పాట్లకే సర్వం దానం చేసిన రంతి దేవునిలా అయ్యాడు.

పరిస్థితులు అన్నీ గమనించిన సుమ తానే ధైర్యానికి వచ్చి "ఈ పెళ్ళి నాకు ఇష్టంలేదు నాన్నా" అంది.

"పీటల మీది పెళ్ళి ఆగితే తర్వాత నిన్నెవరు చేసుకుంటారే?" అంది తల్లి.

"ఎవరూ చేసుకోవద్దు. మీతోనే ఉంటా" అంది ఆ అమ్మాయి.

"ఈ ఏర్పాట్లు ఖర్చు అంతా వృధా కాదా తల్లీ" అన్నాడు తండ్రి. ఆ తర్వాత ఏదో అంది వచ్చిన సంబంధం చేద్దాంకానీ, ఇప్పుడీ సంకట పరిస్థితి తప్పితే చాలని ఉందతనికి.

"చెల్లి పెళ్ళి చేసేద్దాం"

"ఇప్పుడా - ఎలా? అబ్బాయెవరు?"

"ఉన్నాడు. కుమార్ మామయ్యను చేసుకోవాలని ఉంది దానికి" ఆ మాటకు తల్లి ఏమీ అనలేదు. కుమార్ తన చిన్నమ్మ కొడుకు. బాల్యంలో తల్లి, తండ్రి పోవటంతో తమింటనే సొంత తమ్మునిలా పెరిగాడు. ఇప్పుడీ పెళ్ళికి వచ్చి అన్ని పనులూ తానే చేస్తున్నాడు.

"పెద్దదాన్ని నిన్ను వదిలి చిన్నదాని పెళ్ళి చేయడమెలాగే?"

"నా ఫారన్ మొగుడు అందనంత దూరంలో ఉన్నాడమ్మా. దాని ఇండియా మొగుడు దగ్గరగా ఉన్నాడు. అందుకే ఏదో ఒక పెళ్ళి కానిస్తే మీకు కొంత భారం దిగిపోతుంది కదా."

"బావను మరోసారి బతిమిలాడి అడిగి చూస్తానమ్మా"

"వద్దు నాన్నా, నా పెళ్ళి ఏర్పాట్లతో మీ ఆస్తి హారతి కర్పూరం అవుతున్నది. అయినా మీరు బికారిగా అగౌరవంపాలు కావటం నాకు ఇష్టంలేదు."

ఇంకేం? క్షణాల్లో పరిస్థితి మారింది! చెల్లి ఏమో అనబోతే చిరునవ్వుతో ఆమె నోరుమూసి, తన అలంకారాలు తీసి ఆమెను పెళ్ళికూతురుని చేసింది సుమ. కుమార్ ఏదో అనబోతే కన్నీళ్ళతో జాలిగా చూస్తూ చేతులు మోడ్చింది.

తిరిగి మేళతాళాలు మ్రోగాయి. బంధువులు ఉన్నారు, పెళ్ళి ఏర్పాట్లన్నీ ఉన్నాయి. వధూవరులు మారిపోయారంతే. రాత్రి 12 గంటల సుముహూర్తానికి పెళ్ళి జరుగుతున్నది.

ఎదుర్కోలు ఊరేగింపు కోసం ఎదురుచూస్తున్న మగపెళ్ళివాళ్ళు, వీళ్ళు ఎంతకూ రాక పోయేసరికి మనిషిని పంపారు. విషయం తెలిసి దుముకులాడారు. రాయబారాలు పంపి విఫలమై, కోపతాపాలు - పశ్చాత్తాపాలతో చేతులు పిసుక్కుంటూ తిరిగి వెళ్ళారు తిరిగి చూడకుండా రెండు సర్వీసుల నిండా. వేరే సంబంధం చూసి వారం రోజులలోగా వివాహం చేస్తానని తండ్రి అన్నా వినక, చేసిన పెళ్ళి చాలని వరుడు విదేశానికి వెళ్ళిపోయాడు.

చెల్లి అత్తవారింటికి వెళ్ళిపోయింది. సుమ ఏమీ జరగనట్లే ఎప్పటివలె మెలగసాగింది. ఆమె నిర్లిప్తంగా మారింది. ఆమె గుండెలోని ఉప్పెనలు అగ్ని పర్వతంలోని లావావలె బయటకు కన్పించనివి.

ఈ మధ్య బావ ఉత్తరాలు వస్తున్నాయి. తనది పొరబాటు అయింది, క్షమించమని. ఏ కట్నం, కానుకల ప్రసక్తి లేకుండా సుమని పెళ్ళి చేసుకుంటానని అన్నాడు. ఆ ఉత్తరాలు చూసి తల్లీతండ్రీ ఆమెవైపు ఆశగా, జాలిగా చూస్తున్నారు. నిర్ణయం ఆమె చేతిలోనే ఉంది.

"ఫారన్ మొగుడు" తనకు తప్పేలాలేదని నవ్వుకుంది సుమ.